క్లుప్తంగా

సాయిబాబా మందిరానికి శంకుస్థాపన

కడియం: మండలంలోని కడియపుసావరంలో సాయిబాబా మందిరం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సర్పంచులు చక్కపల్లి మురళి, అన్నందేవుల చంటి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని మాజీ వార్డు మెంబర్ బత్తిన అప్పారావు అన్నారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై కుక్కలు దాడి చేస్తున్నాయని అన్నారు. ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారులను సైతం వదలడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అప్పారావు కోరారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాల, జూనియర్ కళాశాల, ఉన్నత విద్య సంస్థల్లో కనీసం మూడేళ్ల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలన్నారు. తాము ఓటరుగా నమోదైన మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ వారికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తును వచ్చే నెల మూడో తేదీ లోపు ఓటరు నమోదుకు ఫారం 19తో పాటు సర్వీసు సర్టిఫికెట్, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు జత చేసి సమర్పించాలన్నారు.

సొమ్ము మాయంపై ఫిర్యాదు

కడియం: తమ సొమ్మును వీఓఏ మాయం చేసిందని కడియపులంక గ్రామానికి చెందిన శాంతిశ్రీ సంఘం సాయి మణికంఠ డ్వాక్రా సంఘ సభ్యులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ సదరు గ్రూపు ద్వారా కడియం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి లోన్ తీసుకున్నామన్నారు. ఈ లోన్ వాయిదాలను వీఓఏ పి.నాగమణి ద్వారా ప్రతి నెలా చెల్లించేవారమన్నారు. కానీ తమ గ్రూప్ సభ్యుల రుణానికి సంబంధించి తిరిగి చెల్లింపులు చేయలేదని బ్యాంకు నుంచి సమాచారం వచ్చిందన్నారు. దీనిపై నాగమణిని ప్రశ్నించగా, తమపైనే ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో తమ సొమ్ము సుమారు రూ.25 లక్షలు రికవరీ చేసి బ్యాంకుకు జమ చేయడానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే బాధితులు కడియం పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

ఘనంగా కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న సాహితీవేత్తలు

సీటీఆర్ఐ: స్థానిక సంహిత కన్వెన్షన్ హాల్‌లో రెండో రోజు కళా గౌతమి 33 వసంతాల వేడుక సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం విజయవంతమైంది. కళా గౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి, నూతన అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు, కార్యదర్శి డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి నేతృత్వంలో జరిగిన ఈ సభను ప్రముఖ విద్యావేత్త జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త వారణాసి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ కళా గౌతమి స్థాపించిన దగ్గర నుంచి కవుల సహాయ సహకారాలు మరువలేమన్నారు. ముఖ్యంగా వారణాసి సుబ్రహ్మణ్యం సేవలు గణనీయమైనవని తెలిపారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సాహిత్యం అంటే తనకు ఎనలేని ప్రేమని, అందుకే ఇటువంటి కార్యక్రమాలకు హాజరయ్యే విధంగా చేసిందన్నారు. వారణాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భాషా సాహిత్యాలపై అర్థవంతమైన చర్చలు జరగాలన్నారు. అనంతరం వారణాసి సుబ్రహ్మణ్యంను, తెలుగు వెలుగు కామేశ్వరరావులను సత్కరించారు.

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

కంబాలచెరువు: ప్రజలకు అర్థమయ్యేలా రచనలు చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా ఉద్యమ నిర్మాణకర్త గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్‌లో బుధవారం జరిగింది. కళాశాల అధిపతి డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ వ్యవహారిక భాష ఆవశ్యకతను తెలియజేశారు. తెలుగు ప్రత్యేకతలపై ప్రసంగిస్తూ కొన్ని ప్రశ్నలు వేసి సమాధానం ఇచ్చిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇచ్చారు. విశిష్ట అతిథిగా, ఉపన్యాసకులుగా విచ్చేసిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సహచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాష ప్రత్యేకత, భాష విస్తృతి, వ్యవహారిక భాష ఆవశ్యకతను వివరించారు. సమన్వయకర్త తెలుగు శాఖ అధిపతి డాక్టర్ పీఏ సత్యనారాయణ మాట్లాడుతూ భాషా దినోత్సవం సందర్భంగా వక్తృత్వ, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించామని చెప్పారు. తెలుగు శాఖ అధ్యాపకులు షేక్ జరీనా బేగం, బి.సుబ్బలక్ష్మి, సముద్రాల ప్రిస్కిల్లా తదితరులు పాల్గొన్నారు.



పటిష్ట చర్యలతోనే భద్రత

కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా ఆసుపత్రుల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలి. ఒకవైపు కుటుంబాన్ని, మరోవైపు సుఖసంతోషాలను సైతం త్యాగం చేసి వైద్యులుగా సేవలందిస్తుంటాం. రాత్రనక, పగలనక నిత్యం సేవలందిస్తున్న వైద్యులపై దాడులకు పాల్పడడం దారుణం. కేవలం వైద్య రంగంలోనే కాకుండా మహిళలు పనిచేసే అన్ని విభాగాల వద్ద పటిష్టమైన రక్షణ ఏర్పాట్లు చేయాలి.

– వి.జయవర్ధిని, వైద్యురాలు, యూపీహెచ్‌సీ, ఆవ వాంబే కాలనీ



వైద్యులకు భరోసా కల్పించాలి



ప్రజా సేవ చేసే వైద్యులకు భరోసా కల్పించాలి. పని ప్రదేశంలో తగిన రక్షణ చర్యలు ఉండాలి. కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా పటిష్టమైన, కఠినమైన చట్టాలు అమలు చేయాలి. వైద్యులు, నర్సులు ఎంతో సేవా భావంతో పని చేస్తారు. వారికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి. మహిళలు, ఆడ పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి.

– పి.లక్ష్మీమృదుల, గైనకాలజిస్ట్, రాజమహేంద్రవరం



తుమ్మలావ వద్ద అధ్వానంగా డ్రైనేజీ



కోటిలింగాల క్షేత్రం వద్ద పేరుకుపోయిన చెత్త

దోమల దండయాత్ర

- నగరంలో నో ఫాగింగ్
- సీజనల్ వ్యాధుల విజృంభణ
- పట్టించుకోని అధికారులు



ఫాగింగ్ చేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది (ఫైల్)

సీటీఆర్ఐ: దోమలు రక్తం పీల్చేస్తున్నాయి.. జనానికి నరకం చూపిస్తున్నాయి. రాత్రి, పగలు అనే లేకుండా జనావాసాలపై దండయాత్ర చేస్తున్నాయి. పగలంతా వివిధ పనులతో అలసిసొలసి రాత్రికి కాస్త విశ్రాంతి తీసుకుందామనుకునే వారు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. కుట్టి రక్తాన్ని పీల్చడమే కాకుండా బోనస్‌గా వైరల్ జ్వరాల బారిన పడేలా చేస్తున్నాయి. ప్రస్తుతం రాజమహేంద్రవరం నగరంలో డెంగీ, మలేరియా, విష జ్వరాల కేసులు అధికమవ్వడమే అందుకు కారణం. అసలే వర్షాకాలం, ఆపై నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరిగి రాత్రిళ్లు దాడులకు దిగుతున్నాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎక్కువ ఉండడంతో ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.

పట్టించుకోక.. సమస్య తీరక

నగరం వ్యాపార కేంద్రంగా పేరొందింది. ఇక్కడ మొత్తం 97,840 గృహాలు ఉన్నాయి. 630 కిలోమీటర్ల మేర మురుగు కాలువల వ్యవస్థ ఉంది. అలాగే అనేక మురుగు వాడలు ఉన్నాయి. కాలువలతో పాటు రోడ్లపై చెత్తను తొలగించే నాథుడే కానరావడం లేదు. సిబ్బంది చుట్టపు చూపుగా వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు దిగజారాయని, వీటిని పర్యవేక్షించాల్సి అధికారులు కనిపించడం లేదని అంటున్నారు. దోమల నివారణకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నామని చెబుతున్న కార్పొరేషన్ అధికారులు మాత్రం క్షేత్ర స్థాయిలో దోమల నివారణ చర్యలు చేపట్టిందే లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో నిత్యం యంత్రాలతో ఫాగింగ్ చేపట్టి దోమలను సమస్య లేకుండా చేసేవారు. నేడు పరిస్థితులు దీనికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. ప్రజల ఆరోగ్య సమస్యలపై కార్పొరేషన్ పట్టించుకోవడం లేదు. ప్రతి సచివాలయ పరిధిలో ఆయా డివిజన్లో నామమాత్రంగా ఫాగింగ్ చేస్తున్నారు. ఫాగింగ్ చేయడానికి ఎనిమిది యంత్రాలే ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పకనే అర్థమవుతోంది. మరికొన్ని అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఈ ప్రక్రియ కొన్ని డివిజన్లకే పరిమితం అవుతోంది. సీజన్‌లో కనీసం ప్రతి డివిజన్‌లో రెండు రోజులకు ఒకసారైనా ఫాగింగ్, దోమల నివారణకు కాలువల్లో స్ప్రేయింగ్ చేయాలి. దీని నిమిత్తం ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా పూర్తి స్థాయిలో స్ప్రేయింగ్, ఫాగింగ్ జరగడం లేదు. పారిశుధ్య కార్మికులు డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించి దోమల లార్వా నివారణ మందు స్ప్రే చేయడం లేదు. దీని వల్ల దోమలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోక..



నగరంలో పారిశుధ్య సమస్య ఇబ్బందిగా మారింది... వర్షాకాలంలో కూడా పట్టించుకోకపోవడం దారుణం. చెత్తాచెదారంతో పాటు కాలువల్లో సిల్టు తొలగించక దోమలు విజృంభిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదు. దీనివల్ల దోమలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం.

– చైతన్య నాయుడు, స్థానికుడు

చెత్త తొలగించక..



కాలువల్లో తీసిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. అలాగే డ్రైనేజీలు శుభ్రం చేయక నీరు కంపు కొడుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సర్వే ప్రకారం రాష్ట్రంలో మున్సిపాలిటీలో సంవత్సరానికి 16.5 లక్షల టన్నుల వ్యర్థాల తరలింపునకు నోచుకోవడం లేదు. నగరంలో విద్యా సంస్థల వద్ద రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

– **తాడేపల్లి విజయ్‌కుమార్**, అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

'మారుతీనగర్ సుబ్రమణ్యం' యూనిట్ సందడి



మాట్లాడుతున్న హీరో అంకిత్ కొయ్యా, దర్శకుడు లక్ష్మణ్‌కార్య, హీరోయిన్ రమ్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'మారుతీనగర్ సుబ్రమణ్యం' సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు చిత్ర యూనిట్ ధన్యవాదాలు తెలిపింది. నటులు రావు రమేష్, ఇంద్రజ ప్రధాన పాత్రలో రూపొందిన మారుతీనగర్ సుబ్రమణ్యం చిత్ర యూనిట్ విజయ యాత్రలో భాగంగా స్థానిక శివజ్యోతి థియేటర్‌కు బుధవారం సాయంత్రం వచ్చింది. లక్ష్మణ్‌కార్య రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, అంకిత్ కోయ, ఇంద్రజ, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, శివన్నారాయణ, అన్నపూర్ణ, ప్రవీణ్ తదితరులు నటించారు. డైరెక్టర్ సుకుమార్ భార్య తబిత సుకుమార్ సమర్పణలో బుజ్జిరాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. వర్ధమాన నటుడు అంకిత్ కొయ్యా, నటి రమ్య పసుపులేటి, డైరెక్టర్ లక్ష్మణ్ కార్యలు ప్రేక్షకులతో కలిసి సందడి చేశారు. సినిమాలోని ఒక పాట చరణం పాడడంతో ప్రేక్షకులు కూడా గొంతు కలిపారు. తమకోసం వెయిట్ చేసిన గాయత్రీ కాలేజీ విద్యార్థులకు అంకిత్ కృతజ్ఞతలు చెబుతూ కాలేజీ ఫ్రెషర్స్ డేకి వస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించాడు. ఈ సినిమాలో అకౌంట్‌లో పది లక్షలు వేసినట్లే ప్రేక్షకుల్లో ఒకరిని సెలక్ట్ చేసి అక్కౌంట్‌లో డబ్బులు వేస్తామన్నారు. తొలుత వారికి సినిమా పంపిణీ చేసిన మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్లు ఉదయ రాజు, సత్తి సత్తిరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం అంకిత్ మీడియాతో మాట్లాడుతూ విశాఖకు చెందిన తాను 12 సినిమాల్లో చేసినప్పటికీ ఈ సినిమాతోనే మంచి గుర్తింపు లభించిందన్నారు. దర్శకుడు లక్ష్మణ్‌కార్య మాట్లాడుతూ హ్యాపీ వెడ్డింగ్ సినిమా తరువాత మారుతీనగర్ సుబ్రమణ్యం రెండో సినిమాఅని, దీనిని చూసి అందరూ ఎంజాయ్ చేస్తున్నారన్నారు. మారుతీనగర్ సుబ్రమణ్యం సీక్వెల్ ఏమీ అనుకోలేదని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. హీరోయిన్ పసుపులేటి రమ్య మాట్లాడుతూ సినిమాను అన్నివర్గాల ప్రేక్షకులు అలరిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

అమరవీరులకు సీపీఎం నివాళి

ప్రకాశంనగర్: స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం విద్యుత్ సమస్యలపై పోరాడుతూ పోలీసు తూటాలకు బలైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలకు ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ 2000లో టీడీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు జరిపిన కాల్పుల్లో కమ్యూనిస్టులు అమరులయ్యారని గుర్తుచేశారు. నేడు టీడీపీ ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడవకముందే యూటర్న్ తీసుకుని ప్రజలపై విద్యుత్ భారం మోపేందుకు సిద్ధపడుతుందని విమర్శించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



వేపపిండి వినియోగం గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు ద్వారకాదేవి, శాంత ఆలివ్

కడియం: మేలైన యాజమాన్య పద్ధతులతో వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు కె.ద్వారకాదేవి, శాంత ఆలివ్ అన్నారు. దుళ్లలోని అయిలు సుబ్బారావు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగులో మితిమీరిన రసాయన ఎరువుల వినియోగం జరుగుతుందన్నారు. దీనివల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఎకరాకు ఐదు కిలోల వేప పిండి వినియోగిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ వేప పిండిని ఒక వస్త్రంలో మూటకట్టి తగిన నీటిలో 24 గంటలు నానబెట్టిన అనంతరం 100 గ్రాముల పాల ఇంగువాను కలిపి వరిపై పిచికారీ చేయాలని సూచించారు. నారు పోసిన 15 రోజుల తర్వాత నుంచి 20 రోజులకోసారి పొట్ట దశ వచ్చే వరకూ ఈ వేపపిండిని వరిపై పిచికారీ చేయడం వల్ల ఎలాంటి చీడపీడలకు అవకాశం ఉండదన్నారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గిస్తే పెట్టుబడులు తగ్గుతాయని రైతులు గ్రహించాలన్నారు. సేంద్రియ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ద్వారకాదేవి అన్నారు. వేప పిండిని ఏ విధంగా కలపాలో ప్రత్యక్షంగా చూపించి వరి క్షేత్రంలో పిచికారీ చేయించారు. వేదభూమి సీఈఓ రత్నకుమారి మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం, నాబార్డు ద్వారా ద్వారా అందించే పథకాలను వివరించారు. పంటల సాగులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు అధికారులకు తెలియజేశారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ చిక్కాల రాముడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అయిలు లక్ష్మణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

డీసిల్టేషన్ విధివిధానాలపై చర్చ



డీసిల్టేషన్ పనులపై సమావేశంలో చర్చిస్తున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

ధవళేశ్వరం: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇసుక డీసిల్టేషన్ తవ్వకాలు, అప్పగించే పద్ధతిపై విధివిధానాలు రూపొందిస్తామని చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి ఎంప్యానెల్‌మెంట్ కమిటీ తొలి సమావేశానికి చైర్మన్‌గా చిన్నరాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తొమ్మిది డీసిల్టేషన్ రీచ్‌లను గుర్తించామన్నారు. పర్యావరణ అనుమతుల అనంతరం కార్యాచరణకు అనుగుణంగా ఇసుక తవ్వకాలు బోట్స్ మ్యాన్ సొసైటీ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన, అర్హత కలిగిన వారి ద్వారా చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే జిల్లా స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

బ్యారేజీకి సంబంధించిన ఫోర్‌షోర్ ప్రాంతంలో బోట్స్ మెన్ సొసైటీలు నిర్వహించే డీసిల్టేషన్ ఆపరేషన్‌లో తవ్విన మెటీరియల్ రవాణా, అప్పగించే పద్ధతిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. జిల్లా స్థాయిలో జేసీ చైర్మన్‌గా, గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ సమన్వయకర్తగా, ధవళేశ్వరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, గోదావరి హెడ్ వర్క్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ తదితరులు సభ్యులు ఉంటారన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్డీఓ కేఎల్ శివజ్యోతి, ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజినీర్ పి.పుల్లారావు, ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, డీపీఓ డి.రాంబాబు, డీటీసీ కేవీ కృష్ణారావు, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ అధికారి బి.సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానాన్ని బాధ్యతగా భావించండి



నేత్రదానం చేయనున్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న హెచ్‌ఎం దుర్గాప్రసాద్

కంబాలచెరువు: సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానాన్ని బాధ్యతగా స్వీకరించాలని డాక్టర్ మద్రా ఇందిర అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ లావణ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇందిర తెలిపారు. నేత్రదానంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నేత్రదానం మనిషి మరణానంతరం మరో ఇద్దరికి చూపును ప్రసాదిస్తుందన్నారు. కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులుగుర్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తాను మరణానంతరం నేత్రాలను దానం చేయనున్నట్లు ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని డాక్టర్ ఇందిరకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, కరుణ, ఉపాధ్యాయులు ఈఎస్ భాస్కరరావు, జాన్సన్ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా



పుష్కరాల రేవు వద్ద వినాయక ఉత్సవాల రాట ముహూర్తంలో పాల్గొన్న జక్కంపూడి రాజా

ప్రకాశంనగర్: రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద ఏటా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఈ ఏడాది కూడా అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం స్థానిక పుష్కరాల రేవు వద్ద రాజమహేంద్రవరం గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. దీనికి రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా గణేశ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. వచ్చే నెల 7న వినాయక చవితి రోజు నుంచి స్వామివారి నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. పూజా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బైరాజు ప్రసాద్‌రాజు, శ్రీకన్య రాజు, కొమ్ముల సాయి, కరుణామయుడు శ్రీను, నీడిగట్ల బాబ్జీ, కోట, బోస్, అడపా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతోనూ ఆదాయం పొందండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కడియం: పూల వ్యర్థాల నుంచి అదనపు ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో కడియం పూల మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోల్‌సేల్ పూల మార్కెట్ నిర్వాహకులు నిత్యం ఇరిగేషన్ కాలువల్లో పూల వ్యర్థాలను వేయడం ద్వారా పరోక్షంగా పర్యావరణ కాలుష్యానికి కారకులు అవుతున్నారని తెలిపారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా పూల వ్యర్థాల నుంచి అదనపు ఆదాయాన్ని పొందడం సాధ్యమన్నారు. అందుకు ఎన్నో సానుకూల అంశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అధ్యయనం చేసి కొంత పెట్టుబడి పెట్టడం ద్వారా ఆదాయ వనరుగా మార్చుకోవాలన్నారు. పూల వ్యర్థాలను డీకంపోస్టు చేసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద చేయవచ్చని స్పష్టం చేశారు. కూలింగ్ ప్రాసెసింగ్ విధానం, పూలను ఎండబెట్టడం ద్వారా వాటి రంగు పోకుండా ఉండే సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకుని, దేశీయ విదేశీయ మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. పూల నుంచి అగరబత్తీలు తయారు చేసే విధానం ఉందని, దీనికోసం తక్కువ పెట్టుబడి పెట్టడం కోసం ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. గులాబీల, ఇతర సుగంధ పూల నుంచి సుగంధ ద్రవ్యాలు తయారు చేసే పద్ధతి అభివృద్ధి చేయడంపై ముందుకు రావాలని కోరారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి.రాంబాబును పూల మార్కెట్ ప్రాంతంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. అనంతరం పర్యాటక పరంగా జిల్లాలో ప్రతిపాదించిన వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనులు, భూముల వివరాలు, వాటికి రావాల్సిన పరిపాలన అనుమతులు తదితర అంశాలపై టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, డీటీఓ ఎంపీడీఓ కె.రత్నకుమారి తదితరులతో సమావేశం నిర్వహించారు. పీడీ ఏపీఎంఐపీ ఎ.దుర్గేష్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, పూల మార్కెట్ యూనియన్ ప్రతినిధులు జి.నాగేశ్వరరావు, పి.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.